RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శనివారం | 17 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 272 | పేజీలు : 4 | వెల : 5/-

## ఆర్థిక మంత్రి హరీశ్‌రావు!

- ఇంటర్ ప్రశ్నపత్రంలో ముద్రణ
- ప్రభుత్వం మారినా తప్పులు తప్పడం లేదని విమర్శలు




4లో

# చందాల దందా!

## పార్టీలకు విరాళాల పేరిట పన్ను ఎగవేత

- చందాదారులపై ఆదాయపు పన్నుశాఖ నజర్
- 20కి పైగా గుర్తింపులేని రాజకీయ పార్టీలు
- రెండేళ్లలో ఐదువేల మందికి ఐటీ నోటీసులు
- విరాళాల చెల్లింపులు, నిధుల మళ్లింపులపై ఐటీ అధికారులు ప్రత్యేక దృష్టి



ముంబై, ప్రభాత సూర్యుడు : ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80 ప్రకారం, ఏదైనా రాజకీయ పార్టీ లేదా ఎలక్టోరల్ ట్రస్ట్‌కు ఇచ్చే విరాళం మొత్తాన్ని పన్ను చెల్లింపుదారు క్లెయిమ్ చేసుకోవచ్చు. టాక్స్ పేయర్లు, పన్ను భారం తగ్గించుకోవడానికి.. రాజకీయ పార్టీలపై అభిమానాన్ని చాటుకోవడానికి ఇలాంటి విరాళాలు ఇస్తుంటారు. సాధారణ ప్రజల భాషలో దీనిని ఎన్నికల విరాళం అని పిలుస్తారు. అయితే, ఒక పన్ను చెల్లింపుదారు ఇచ్చిన మొత్తం ఎన్నికల విరాళం, అతని మె-ుత్తం ఆదాయం కంటే తక్కువగా ఉ ండాలన్నది నిబంధన. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చినట్లు సృష్టించి, పన్నులు ఎగ్గొట్టే వారికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిన టాక్స్‌పేయర్లకు ఆదాయ పన్ను విభాగం నోటీసులు జారీ చేసింది. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఈ నోటీసులు పంపింది. పన్ను కట్టకుండా ఎగ్గొట్టడానికే అనామక పార్టీలకు విరాళాలు ఇచ్చినట్లు క్లెయిమ్ చేసుకున్నారా, లేదా ఆ డబ్బును దుర్వినియోగం చేశారా అన్న కోణంలో ఆరా తీస్తోంది. వాస్తవానికి, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29 కింద రాజకీయ పార్టీలు నమోదై ఉండాలి. వాటికి ఎన్నికల సంఘం గుర్తింపు ఉండాలి. అలాంటి రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలను మా-త్రమే టాక్స్ పేయర్ క్లెయిమ్ చేసుకోగలడు. ఎకనమిక్ టైమ్స్ రిపోర్ట్ ప్రకారం.. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 5 వేల నోటీసులను ఆదాయ పన్ను విభాగం పంపింది. మరింత మంది అనుమానిత పన్ను చెల్లింపుదార్లకు కూడా త్వరలో నోటీసులు వెళతాయి. గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చి, వాటిని క్లెయిమ్ చేసుకున్న పన్ను చెల్లింపుదార్లు ఐటీ నోటీస్ అందుకోవడానికి సిద్ధంగా ఉండాలి. కనీసం 20 రాజకీయ పార్టీలు ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ దృష్టిలో ఉన్నాయి. వీటికి విరాళాలు ఇచ్చినట్లు క్లెయిమ్ చేసుకున్న టాక్స్ పేయర్లు లక్షల్లో ఉన్నారు. ఈ రాజకీయ

మిగతా 2వ పేజీలో...





# సభ 'కుల గళం'!


- శాసనసభలో కులగణనపై తీర్మానం
- పాలితులను పాలకులుగా మార్చే ఉద్దేశం
- చట్టసభల్లో అన్ని కులాలకు సమన్యాయం
- ఎన్నికల హామీ మేరకే సర్కారు నిర్ణయం
- సర్వరోగ నివారిణిలా కులాల సర్వే
- సభలో అధికార పార్టీ నేతల మనోగతం
- కులగణనకు ప్రతిపక్ష బీఆర్ఎస్ సమ్మతం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : బీసీ కులగణన విషయంలో ఎలాంటి అపోహలొద్దని.. బలహీన వర్గాలను బలోపేతం చేయడమే తమ ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణనపై శుక్రవారం అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ సందర్భంగా.. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని అన్నారు. మంచి కార్యక్రమం చేపట్టాలనే ఉద్దేశంతోనే ఈ తీర్మానాన్ని సభ ముందుకు తెచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బయటపెట్టారా.? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీ కులగణనపై మంత్రివర్గంలో తీర్మానం ప్రవేశపెట్టామని.. ఎవరూ అడగకుండానే సభలో ప్రవేశపెట్టామని సీఎం రేవంత్ అన్నారు. పాలితులుగా ఉన్న వారిని పాలకులుగా చేయడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించి వాళ్ల ఆర్థిక ప్రయోజనాలను నిలబెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. 'కులగణనపై చర్చను ప్రతిపక్షం తప్పుదోవ పట్టిస్తోంది. కులగణనను అమలు చేసే క్రమంలో న్యాయ, చట్టపరమైన చిక్కులపై అనుమానం ఉంటే సూచనలివ్వండి. అంతేకానీ, తీర్మానానికే చట్టబద్ధత

మిగతా 2వ పేజీలో...

# కూటమి కుప్ప?

- మొన్న నితీశ్‌కుమార్ గుడ్‌బై
- అదేబాటలో మమతా బెనర్జీ
- తాజాగా ఫారూక్ అబ్దుల్లా
- ఇండియా కూటమి నుంచి వైదొలగనున్నట్లు ప్రచారం
- ఎన్‌డీఏలో చేరిపోయే అవకాశం ఉన్నట్లు గుసగుసలు
- విచ్ఛిన్నం దిశగా ఇండియా కూటమి అడుగులు
- పార్లమెంట్ ఎన్నికల ముందర కాంగ్రెస్ పార్టీకి పెను సవాళ్లు



న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు : సార్వత్రిక ఎన్నికల ముందు ఇండియా కూటమికి మరో షాక్ తగిలింది. ఇప్పటికే నితీశ్ కుమార్ జారిపోగా...దీదీ కూటమిపై విమర్శన అస్త్రాలు ఎక్కుపెట్టింది. ఇప్పుడు తాజా కూటమి నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ బయటకు వెళ్లింది. రానున్న లోక్ సభ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆ పార్టీ చీఫ్ ఫారుక్ అబ్దుల్లా ప్రకటించారు. అంటే భవిష్యత్ లో తిరిగి ఎన్డీఏలో చేరనున్నట్లు సంకేతాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌కు అత్యంత నమ్మకమైన భాగస్వామి చేయిజారిపోవ డంతో ఇక మిగిలిన కూటమి సభ్యులు ఏమాత్రం కలిసికట్టుగా ఉంటారన్నది ప్రశ్నార్థకమే. ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎన్నికల ముందు మరో ఎదురుదెబ్బ తగిలింది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జమ్ము, కశ్మీర్‌కు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్

మిగతా 3వ పేజీలో...

# కారు నేతలు కాంగ్రెస్‌లో కలిశారు!



- వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా
- జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్
- ఏఐసీసీ స్టేట్ ఇన్‌చార్జ్ దీపాదాస్ సమక్షంలో చేరిక
- వీరి బాటలో మరికొందరు కాంగ్రెలో చేరికకు చర్చలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : లోక్ సభ ఎన్నికలకు ముందు తెలంగాణలో రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇన్నాళ్ళ పార్టీ జాయినింగ్స్‌పై మౌనంగా కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్‌లో కీలక నేతల చేరికలతో రాజకీయ పరిణామాలు ఏ విధంగా మారబోతున్నాయనే అంశం ఆసక్తికరంగా మారింది. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి, వికారాబాద్ జిల్లా పరిషత్

మిగతా 3వ పేజీలో...

# లచ్చునాయక్ లంచం!



- నల్లగొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ చేతివాటం
- మెడికల్ డిస్ట్రిబ్యూటర్ నుంచి డబ్బులు డిమాండ్
- రూ.3లక్షల తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం


నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఔషధాల టెండర్ కోసం వెంకన్న అనే వ్యాపారి నుంచి సూపరింటెండెంట్ లచ్చునాయక్ డబ్బులు డిమాండ్ చేశారు.

2లో

# ఈటల సీటెక్కడా..?

- అసెంబ్లీ ఓటమితో అయోమయం
- ఎంపీగా పోటీకి తీవ్ర ప్రయత్నం
- మల్కాజిగిరిపైనే ప్రధాన దృష్టి
- అదే స్థానంపై బీజేపీ నేతల్లో పోటీ
- ఈటలకు అధిష్టానం బుజ్జగింపులు
- మరో స్థానంపై రాజేందర్ విముఖత
- పార్టీ మారుతారా? సర్దుకుంటారా?

కరీంనగర్, ప్రభాతసూర్యుడు : బీజేపీలో సీనియర్ నేత ఈటల రాజేందర్ పై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. మల్కాజిగిరి పార్లమెంట్ టిక్కెట్ కోసం ఆయన పట్టుబడుతున్నారని ఇవ్వకపోతే పార్టీకి గుడ్ బై చెప్పడానికి కూడా రెడీగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయారు. ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం మొదలైంది. దీంతో ఈటెల రాజేందర్ దేశంలోనే అతి పెద్ద మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై గురిపెట్టారని తెలుస్తోంది. మరోవైపు ఈటలతో పాటు బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేయాలని నేతలు క్యూ కడుతున్నారు. అయితే నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో బీజేపీ అధిష్టానం అభ్యర్థి ఎంపికపై సీనియర్ నేత పైడి రాకేష్ రెడ్డికి పార్లమెంట్ ఇన్చార్జి బాధ్యతలు ఇది వరకే అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన ఈటల.. తీవ్ర పోటీ ఉన్న ఈ మల్కాజిగిరి పార్లమెంట్ పైనే గురిపెట్టడంతో పార్టీలోని ఇతర ఆశావాహులకు నచ్చడం లేదు. అధిష్టానం ఈ పార్లమెంట్‌లో గెలవాలని భావించి.. ఫోకస్ పెంచింది. ఈ అక్కడే పోటీ చేసేందుకు నేతలు క్యూ కడుతున్నారు. రెండు చోట్ల ఓడిపోయిన ఈటల ఈ స్థానం కాకుండా మెదక్



మిగతా 4వ పేజీలో...

# ఢిల్లీకి కాంగ్రెస్ సూట్‌కేసులు!



- రాహుల్‌గాంధీ కోసం రాష్ట్రంలో బెదిరింపులు
- బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌జీ ధ్వజం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని భాష్యం
- మోదీతోనే దేశం అభివృద్ధి సాధ్యమని జోస్యం

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వంలో

మిగతా 4వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# లచ్చునాయక్ లంచం!

- నల్లగొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ చేతివాటం
- రూ.3లక్షల తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం



**నల్లగొండ - ప్రభాతసూర్యుడు :** మరో అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఔషధాల టెండర్ కోసం వెంకన్న అనే వ్యాపారి నుంచి సూపరింటెండెంట్ లచ్చునాయక్ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో పక్కా ప్లాన్ తో వెంకన్న నుంచి లచ్చునాయక్ ఆయన నివాసంలో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి గత రెండేళ్లుగా ఔషధాలు సరఫరా చేస్తున్నట్లు వ్యాపారి వెంకన్న తెలిపారు. కొన్నాళ్లుగా సూపరింటెండెంట్ 10 శాతం కమిషన్ తీసుకుంటున్నారని.. ఇటీవల అధిక శాతం కావాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. నెల రోజుల క్రితం రూ.లక్ష ఇవ్వగా.. 4 రోజుల క్రితం మరో రూ.3 లక్షలు డిమాండే చేశారని చెప్పారు. అడిగిన డబ్బులు ఇవ్వకుంటే టెండర్లు పిలిచి బయటి వారికి ఇస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు. డబ్బులు కట్టలేక ఏసీబీ డీఎస్పీని సంప్రదించగా.. వారి సూచన మేరకు శుక్రవారం ఉదయం డబ్బులు ఇచ్చానని చెప్పారు.



# దివ్యాంగుల పట్ల కలెక్టర్ శశాంక్ ప్రత్యేక శ్రద్ధ

**వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళ్ల జంగయ్య**

**యాచారం - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ దివ్యాంగులపై ప్రత్యేక చొరవతో మంచానికే పరిమితమైన దివ్యాంగులకు శుక్రవారం వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ లో సదరం సర్టిపికేట్ కొరకు డాక్టర్లచేత అసెస్మెంట్ చేయించారు. ఈ సందర్భంగా వి హెచ్ పి ఏస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళ్ళ జంగయ్య మాట్లాడుతూ గత సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు మంచానికి పరిమితమైన దివ్యాంగులకు సదరం సర్టిపికేట్స్ ఇవ్వాలని ధర్నా నిర్వహించారు . కలెక్టర్ ను విన్నవించగా ప్రత్యేకంగా డాక్టర్లతో మాట్లాడి దివ్యాంగులకు అసెస్మెంట్ చేయాలని కోరగా అసెస్మెంట్ చేయడం. దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకున్న జిల్లా కలెక్టర్ శశాంక్,ఐకేపి డిపిఎం సూర్య కు వికలాంగుల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరం క్యాంపు ఎపిఎం జంగయ్య,వి హెచ్ పి ఏస్ యాచారం మండల అధ్యక్షులు మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌పై వీగిన తీర్మానం

**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి పై కొంతమంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మున్సిపల్ చైర్మన్ తో కలిసి 24 మంది కౌన్సిలర్లు ఉండాలి. అందులో కొంతమంది గత నెల 17వ తేదీన అవిశ్వాసం పెట్టారు. దానిపై శుక్రవారం మున్సిపల్ సమావేశం ఓటింగ్ పెట్టారు. ఉదయం 11 గంటల నుండి 11:30 మొదటి విడతగా రెండో విడతగా 12 గంటల నుండి 12:30 వరకు ఎవరు రాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సాగర్, ఆర్డీవో అనంతరెడ్డి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కోరం లేక వీగిపోయింది. కోరం పూర్తి కావాలంటే సమావేశానికి స్థానిక మొత్తం సభ్యులు 24 మంది ఎక్స్ ఆఫీసియో సభ్యుడైన ఎమ్మెల్యేతో కలిసి కనీసం 17 మంది సభ్యులు హాజరు కావాలి. ఎవరు హాజరు కాకపోవడంతో ప్రెసిడెంగ్ అధికారి అవిశ్వాస తీర్మానం విసిగిపోయినట్టు ప్రకటించారు.





# ప్రశాంతంగా గ్రామీణ భారత్ బంద్




**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం దేశ వ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ అబ్దుల్లా పూర్మెట్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ భారత్ బంద్ మండల కేంద్రంలోని విజయవాడ జాతీయ రహదారిపై, పెద్ద అంబర్ పేట్ చెక్ పోస్ట్ వద్ద సిఐటియు నాయకులు, కార్మిక సంఘాలు రాస్తారోకో చేశారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్లపై బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.జగదీష్, మండల కన్వీనర్ ఏర్పుల నరసింహాలు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక ,రైతు చట్టాల్లో, వ్యతిరేకమైన చట్టాలు తీసుకొచ్చి, కార్పొరేట్ సంస్థలకి అప్పజెప్పే ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో దళిత క్రిస్టియన్ మైనార్టీలపై దాడులు పెరిగాయని, భారతదేశాన్ని మతతత్వ కాషాయ దేశంగా మార్చాలని పెద్ద కుట్ర చేస్తున్నారని విమర్శించారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గుండె శివకుమార్, సిఐటియు నాయకులు, ప్రభాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి ఇరుగు బిక్షపతి, సిఐటియు నాయకులు, నరసింహ జంగయ్య, కృష్ణ, రవి, పోచమ్మ లక్ష్మమ్మ,శారద, పోచయ్య, దర్శన్, లక్ష్మయ్య, ఊర్మిళ గోపాల్ వందలాది మంది కార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మానవాళి మనగడకు ప్రకృతి సంరక్షణే మార్గం

- గురునానక్ విద్యాసంస్థల్లో వృక్షో రక్షతి రక్షితః కార్యక్రమం
- భవిష్యత్తు తరాలకు భూగోళాన్ని పరిరక్షించడం



**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** రంగ రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్యాసంస్థలో శుక్రవారం ప్రపంచంలోనే అతి పెద్ద మల్టీ నేషనల్ కంపెనీ వర్చ్యూసా సహకారంతో విద్యాసంస్థల యా–జమాన్యం వారి సౌజన్యంతో కంపెనీ ప్రతినిధులు విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులు సిబ్బంది వృక్షో రక్షతి రక్షితః కార్యక్రమంలో పాల్గొని దాదాపుగా 2500 మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వర్చ్యూసా కంపెనీ ప్రతినిధులు అవిజిత్ ఛటర్జీ, పూజ ప్రకాష్ లాల్ , యునైటెడ్ వే అఫ్ హైదరాబాద్ వసీం ఆక్తర్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ ఎస్ సాయిని , పాల్గొన్నారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్దీప్ సింగ్ కోహ్లీ ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు భూగోళాన్ని పరిరక్షించడం పర్యావరణ పరంగా సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ, వాతావరణ సమతుల్యం ఉండాలంటే 33% పచ్చదనం తప్పనిసరిగా ఉండాలని పెరుగుతున్న జనాభాతో అవసరాలు పెరిగి అడవులు కనుమరుగవుతున్నాయని దానివల్ల వాతావరణంలో మార్పులు వచ్చి ఉష్ణోగ్రతలు పెరిగి వర్షపాతం తగ్గి నీటి నిలువలు తగట్టంతో ఓజోన్ పొర క్షీణించి మనవాళితో పాటుగా జంతు పక్షుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని వివరిస్తూ అలాంటి తీవ్ర పరిణామాల నుండి మానవాళి బయట పడాలంటే ప్రకృతిని రక్షించుకోవడం ఒక్కటే మార్గమని అందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నటి వాటిని పరిరక్షిండం ద్వారా ఈ దుష్ప్రభావాన్ని తగ్గించవచ్చని చెపుతూ హరిత హారం ద్వారా మొక్కలను నాటడం పెంచడం చేస్తున్నామని అందుకు ప్రముఖ కార్పొరేట్ సంస్థలు కూడా తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారికి యాజమాన్యం తరపున ధన్యవాదాలు తెలియచేశారు . ఈ కార్యక్రమంలో వినయచోప్రా డైరెక్టర్ కార్పొరేట్ రిలేషన్స్, కె వెంకటరావు డైరెక్టర్, ఎస్ శ్రీనాథరెడ్డి ప్రిన్సిపాల్, పి పార్ధసారదే జాయింట్ డైరెక్టర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# చందాల దందా!

మొదటిపేజీ తరువాయి..

పార్టీలు రిజిస్టర్ అయ్యాయి కానీ ఎన్నికల సంఘం నుంచి ఇంకా గుర్తింపు పొందలేదు. అంతే కాదు, క్లెయిమ్ చేసుకున్న సందర్భాల్లో, విరాళాలు ఇచ్చిన విధానం పన్ను చెల్లింపుదార్ల ఆదాయంతో సరిపోవడం లేదు. ఇది అనుమానాస్పదంగా మారింది. కొన్ని కేసుల్లో, విరాళం తీసుకున్న పార్టీలు నగదు రూపంలో పన్ను చెల్లింపుదార్లకు ఆ డబ్బును తిరిగి ఇచ్చాయి. అంటే, విరాళం ఇచ్చినట్లు చూపి క్లెయిమ్ చేసుకుంటున్నారు, మళ్లీ ఆ డబ్బును తిరిగి వెనక్కు తీసుకుంటున్నారు. ఎన్నికల విరాళాల పేరిట పన్ను ఎగవేతకు, మనీలాండరింగ్‌కు పాల్పడిన కేసులు గతంలో కూడా వెలుగులోకి వచ్చాయి. ఆదాయానికి మించి విరాళాలు ఇవ్వడం లేదా మొత్తం ఆదాయంలో 80 శాతం వరకు విరాళాలుగా చూపిన అనేక ఉదంతాలను ఆదాయ పన్ను విభాగం గుర్తించింది.

# సభ'కుల గళం'!

మొదటిపేజీ తరువాయి..

లేదన్నట్లుగా మాట్లాడడం మనందరికీ మంచిది కాదు. మేం రహస్యంగా ఏమీ చేయడం లేదు. ఈ తీర్మానంపై రాష్ట్ర జనాభాలో అరశాతం ఉన్న వాళ్లకు బాధ ఉండొచ్చు. రాష్ట్రాన్ని గుప్పిట్లో పెట్టుకున్నాం. లెక్కలు బయటకు వస్తే 50 శాతం జనాభా ఉన్న వాళ్లకు రాజ్యాధికారంలో ఎక్కడ భాగం ఇవ్వాల్సి వస్తుందోనన్న బాధ ఉంటుందేమో.?. ఇప్పటికైనా ప్రధాన ప్రతి పక్ష నేత సభకు రావాలి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్తశుద్ధిపై మాకు ఎలాంటి అనుమానం లేదు. కానీ సహవాస దోషం అన్నట్టుగా కొంతమంది పక్కన కూర్చోవడంతో ఆయన్నూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంత మంచి తీర్మానం చేసినప్పుడైనా దాన్ని స్వాగతించి సూచనలు చేయాల్సిందిగా కోరుతున్నాం. సహేతుకమైన సూచనలను మేం పరిగణలోకి తీసుకుంటాం.' అని రేవంత్ స్పష్టం చేశారు. కులగణనపై ప్రజలకు అనుమానం లేవనెత్తేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. చట్ట సభల్లో అన్ని కులాలకు న్యాయం చేసేందుకు కులగణన ప్రక్రియ చేపట్టామని అన్నారు. దీనిపై మాకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని.. గతంలో కాంగ్రెస్ హయాంలో జస్టిస్ కమిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే చేశామని గొప్పలు చెప్పుకొనే బీఆర్ఎస్ నేతలు.. ఆ సర్వేను సభలో ప్రవేశపెట్టారా.? అని నిలదీశారు. 'మేనిఫెస్టోలపై ఓ రోజు చర్చిద్దాం. 2014, 2018, 2023లో పార్టీల మేనిఫెస్టోలపై ప్రత్యేకంగా చర్చిద్దాం. ఈ పదేళ్లు మీరేం చేశారు. ఈ 60 రోజుల్లో మేం ఏం చేశామో చర్చిద్దాం. సభలో తీర్మానం ప్రవేశపెట్టింది మేమే' అని సీఎం స్పష్టం చేశారు.

**మంచిదే కానీ**

తెలంగాణ అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రవేశపెట్టారు. దీనిపై మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. కుల గణన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిని, కులాన్ని సర్వే చేసి.. ప్రజల ఆర్థిక స్థితి గతులు తెలుసుకుంటామని అన్నారు. సర్వేలో అన్ని వివరాలు పొందు పరుస్తామని.. సర్వ రోగ నివారిణిలా సర్వే ఉంటుందని పేర్కొన్నారు. కాగా, కుల గణనను తాము ఆహ్వానిస్తున్నట్లు బీఆర్ఎస్ నేత కడియం తెలిపారు.' అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. దేశంలోని సంపద, రాజ్యాధికారం జనాభా దామాషా ప్రకారం దక్కాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందు కోసమే ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కుల గణన చేస్తామని చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా కులగణనతో పాటు సోషల్, ఎకానమిక్, ఎడ్యుకేషన్, పొలిటికల్, ఎంప్లాయిమెంట్ అంశాలపై సర్వే చేస్తాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటిని, అన్ని కులాలు, ఆర్థిక స్థితిగతలపై సర్వే నిర్వహిస్తాం. ఈ సర్వే ద్వారా సంపదను అన్ని వర్గాలకు జనాభా దమాషా ప్రకారం ఎలా పంచాలన్న దానిపై ప్రణాళికలు తయారు చేస్తాం. సామాజిక ఆర్థిక రాజకీయ మార్పునకు పునాదిగా తెలంగాణ మారబోతుంది.' అని భట్టి తెలిపారు. అసెంబ్లీలో కులగణన తీర్మానాన్ని తాము స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కానీ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంలో స్పష్టత లేదని.. దీనిపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు. 'జనం, కులం అంటూ ద్వంద్వ వైఖరి కనిపిస్తోంది. జనగణన చేసే హక్కు రాష్ట్రాలకు లేదు. కులగణన మాత్రమే చేసే హక్కు ఉంటుంది. తీర్మానానికి చట్ట బద్ధత అయినా కల్పించాలి. లేదా న్యాయపరంగా అయినా ముందుకు వెళ్లాలి. ఎలాంటి చట్ట బద్ధత లేకుండా తీర్మానం పెడితే లాభం ఉండదు. కుల గణన చేపట్టిన ఆయా రాష్ట్రాలు న్యాయపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.' అని పేర్కొన్నారు.దీనిపై మంత్రి పొన్నం సమాధానమిచ్చారు. బీసీ కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని.. ప్రతిపక్షాలకున్న సందేహాలు నివృత్తి చేసే బాధ్యత తమదే అని స్పష్టం చేశారు. ఏమైనా సలహాలు,



సూచనలు ఉంటే ఇవ్వొచ్చని.. దానిపై ప్రత్యేక చర్చ చేయండి అంటూ వ్యాఖ్యానించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. అయితే, పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు. తీర్మానం కాదు చట్టం చేయాలని అన్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు రాకుండా కులగణన చట్టం ఉండాలని, ఎలాంటి కోర్టు కేసులకూ అవకాశం ఉండకూడదని చెప్పారు. 'కులగణన పూర్తి కాగానే వెంటనే చట్టం చేస్తే బాగుంటుంది. ఈ ప్రక్రియ తర్వాత చట్టం ఎలాంటి పథకాలు అమలు చేయనుందో ముందే చెప్పాలి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి.' అని పేర్కొన్నారు.ఎంబీసీలను మొదట గుర్తించినదే తెలంగాణ సీఎం కేసీఆర్ అని గంగుల ఈ సందర్భంగా అన్నారు. ఎంబీసీలకు మంత్రి పదవి ఇవ్వాలని.. బీసీ సబ్ ప్లాన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీహార్ లో ఇప్పటికే కుల గణన చేశారని, కానీ న్యాయపరమైన చిక్కులు వచ్చాయని గుర్తు చేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# బస్సుల్లో మార్పులు!

- మెట్రో తరహాలో సీట్లు అమరిక
- మహాలక్ష్మీ పథకం ప్రభావం
- రద్దీని అధిగమించే వ్యూహం
- ఆర్టీసీ సరికొత్త ప్రయోగం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మహాలక్ష్మి పథకం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఎన్నికలకు ముందు సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని ఎక్స్ ప్రెస్ బస్సుల వరకే పరిమితం చేశారు. మహాలక్ష్మి పథ కాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటోంది. మహిళలు ఎక్కువ సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తుండటం వల్ల తమకు నిల్చోడానికి స్థలం కూడా ఉండటం లేదని పురుషులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్నిచోట్ల పురుషులు ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం ఆందోళనలు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల ఆర్టీసీ హైదరా బాద్ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థుల కోసం ఉదయం సాయంత్రం ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది అంటే మహాలక్ష్మి పథకం తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. రద్దీ విపరీతంగా పెరగడం వల్ల బస్సులు కిటకిటలాడుతున్నాయి. దీంతో ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నియంత్రించేందుకు మెట్రో రైలులో సీట్ల మాదిరి ఆర్టీసీ బస్సుల్లోనూ సీటింగ్ విధానాన్ని మార్చేస్తోంది. దీని వల్ల మధ్యలో ఎక్కువమంది నిల్చోవచ్చని ఆర్టీసీ భావిస్తోంది. ఈ నిర్ణయం వల్ల ఆర్టీసీ బస్సులో 25 మంది కంటే ఎక్కువ ప్రయాణికులు అదనంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెబుతోంది. అయితే ఈ సీట్ల మార్పింగ్ ప్రక్రియను ముందుగా హైదరాబాద్‌లో చేపట్టి ఆ తర్వాత రాష్ట్రం మొత్తం విస్తరిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. కాగా, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి 2 నెలలు పూర్తయిన నేపథ్యంలో ఆర్టీసీకి ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు 700 కోట్ల దాకా చెల్లించింది.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**నల్లగొండ - ప్రభాతసూర్యుడు :** నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు బైపాస్ వద్ద అద్దంకి నార్కెట్పల్లి రహదారిపై కారు ముందు వెళుతున్న బైక్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా స్థానికులు తెలిపారు. మృతులు మిర్యాలగూడ పట్టణానికి చెందిన రుద్రాక్ష రాంబాబు (37), మధ్యల శీను (26)గా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




# పాలమూరులో పాదయాత్రల జోరు



**మహబూబ్ నగర్, ప్రభాతసూర్యుడు :** పాలమూరులో రాజకీయ నాయకుల యాత్రల జోరు కొనసాగుతోంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. షెడ్యూల్ కంటే ముందే విజయావకాశాలు మెరుగు పరుచుకునేందుకు పార్టీలు ముందస్తు ప్రచారాలు మొదలుపెట్టేశాయి. ముఖ్యంగా యాత్రల పేరుతో పొలిటికల్ హీట్ పెంచుతూ ఎన్నికల వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్నారు పార్టీ నేతలు. ఉమ్మడి జిల్లాలో ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ప్రచార ముందస్తు ప్రణాళికల్లో నిమగ్నమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ రాకముందే యాత్రల పేరుతో ప్రచారానికి సిద్ధమయ్యారు నేతలు. వచ్చే ఎన్నికలకు అటూ ప్రజల్లోకి వెళ్లడం, పార్టీ క్యాడర్‌ను సన్నధం చేసేలా ప్లాన్‌లు చేస్తున్నాయి పార్టీలు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఊపులో జిల్లాలో యాత్రల ప్రచారానికి మొదట కాంగ్రెస్ పార్టీ నేతలు అంకురార్పన చేశారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి ఇప్పటికే పాలమూరు న్యాయ్ యాత్ర పేరుతో నియోజకవర్గం మొత్తం చుట్టేసేలా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. హస్తం శ్రేణులను సమాయత్తం చేయడంతో పాటు.. పార్లమెంట్ పరిధిలో ప్రజల్లోకి వెళ్లేలా ఆయన యాత్ర నడుస్తోందిఇక తెలంగాణలోని వీలైనన్నీ ఎక్కువ సీట్లు సాధించాలని పట్టున్న స్థానాలపై భారతీయ జనతా పార్టీ ఫోకస్ పెట్టింది. పాలమూరు జిల్లాలోని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ రెండు స్థానాలు ఖచ్చితంగా కమలంకు దక్కే అవకాశముందని నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. అయితే ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ముఖ్య నేతలు యాత్ర చేస్తే విజయావకాశాలు మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుందని యోచిస్తున్నారట పార్టీ క్యాడర్. నారాయణపేట జిల్లా మక్తాల నియోజకవర్గంలోని కృష్ణ నుంచి ఈ యాత్ర ప్రారంభించాలని బీజేపీ నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రకు విజయ సంకల్ప యాత్ర గా నామకరణం చేశారు. మొత్తం మూడు పార్లమెంట్ సెగ్మెంట్ల మీదుగా 11రోజుల పాటు యాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర పూర్తయ్యేలా ప్లాన్ చేశారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ యాత్ర కొనసాగుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనా ఉమ్మడి పాలమూరులో నేతల యాత్రలు పార్లమెంట్ ఎన్నికల వాతావరణాన్ని తెచ్చాశాయని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. షెడ్యూల్ కంటే ముందే పరిస్థితి ఇలా ఉంటే అనంతరం ప్రచార హోరు భారీస్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు



# కుక్కలను కాల్చిచంపిన దుండుగులు

**మహబూబ్ నగర్ - ప్రభాతసూర్యుడు :** మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దారుణం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అర్ధరాత్రి దాటిన తర్వాత మాస్కులు ధరించిన నలుగురు వ్యక్తులు కారులో వచ్చి గన్స్‌తో కుక్కలపై కాల్పులు జరిపారు. రోడ్లపై ఉన్న కుక్కలను కాలుస్తూ గ్రామంలో రోడ్ల వెంబడి తిరిగారు. కుక్కల అరుపులు, గన్ శబ్దాలకు భయపడిన జనం ఇండ్ల నుండి బయటకు రాలేదు. బుల్లెట్ దెబ్బలు తగిలిన కుక్కలు కొన్ని అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొన్ని గాయాలతో పరుగులు తీస్తూ పలు వీధులలో ప్రాణాలు వదిలాయి.. మొత్తము 20కి పైగా కుక్కలు ప్రాణాలు కోల్పోగా.. మరికొన్ని గాయాల పాలు అయినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న భూత్పూర్ సిఐ రామకృష్ణ , అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు, వెటర్నరీ వైద్యులు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత్యువాత పడ్డ కుక్కల మృతదేహాలలో బుల్లెట్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణ జరుపుతున్నారు.

# మహిళను బురిడీ కొట్టించిన దుండగులు

**వికారాబాద్ - ప్రభాతసూర్యుడు :** కొత్త కొత్త ఆలోచనలతో అమాయకులే టార్గెట్ ఈ దొంగలకు. ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలంటున్నారు పోలీసులు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంకులో డబ్బుల చోరీ అయ్యాయి. బ్యాంకులో నుంచి డబ్బులు తీసుకొని మహిళ లెక్కిస్తుండగా దుండగులు డబ్బులు కాజేసారు. చంద్రకళ అనే మహిళ తన బంగారాన్ని కెనరా బ్యాంకులో కుదువ పెట్టి రూ.93000 వేలు అప్పు తీసుకుంది. తీసుకున్న డబ్బులను బ్యాంకులోనే లెక్కిస్తుండగా దగ్గరికొచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు, బ్యాంకులో డబ్బులు ఇచ్చేవారు దొంగ నోట్లు ఇస్తున్నారని మహిళకు మాయమాటలు చెప్పారు. చూద్దామంటూ మహిళ దగ్గర యువకులు కుర్చున్నారు. దొంగ నోట్లను పరిశీలిస్తామంటూ మహిళ వద్ద డబ్బులు తీసుకొని పరిశీలిస్తున్నట్లు నటించారు. మహిళ కన్నుగప్పి 29500 కాజేసారు. ఇంటికెళ్ళి లెక్కించగా 29500 తక్కువగా వచ్చిన డబ్బులు... లబోదిబోమంటూ మొత్తుకంటు బ్యాంక్ కు వచ్చింది మహిళ. తామేమీ చేయలేమని బ్యాంక్ సిబ్బంది చేతులెత్తేసారు. బాధిత మహళ పోలీసులకు ఫిర్యాదు చేసింది

# బోయిన్‌పల్లిలో కారు బీభత్సం

**సికింద్రాబాద్- ప్రభాతసూర్యుడు :** బోయిన్ పల్లిలో ఒక కారు బీభత్సం సృష్టించింది. ఓల్డ్ బోయిన్పల్లి నుండి మల్లారెడ్డి గార్డెన్ వైపు వెళ్తున్న మరో కారును, అంబేద్కర్ విగ్రహానికి ఢీ కొట్టింది. కారు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తుండగా ఘటన జరిగింది. కారులో ఉన్న పలువురికి గాయాలు అయ్యాయి. కారు వేగంగా ఢీకొట్టడంతో మరో కారు ధ్వంసం, అంబేద్కర్ విగ్రహం దెబ్బ తిన్నాయి.

# కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- జిపి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు
- సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ




**మంచాల - ప్రభాతసూర్యుడు :** మంచాల మండలంలో శుక్రవారం దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బందు కార్యక్రమం లో భాగంగా వివిధ గ్రామాల్లో బందు నిర్వహించి సమ్మెలో పాల్గొనడం జరిగింది. ఈ సంద ర్భంగా మండల కేంద్రములో ర్యాలీ తీసి సభ నిర్వహించారు. కార్మిక, రైతు, వ్యవ సాయ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మికులకు తీవ్ర అన్యా యం చేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలపై తీవ్ర భారాలను మోపుతున్నారని అన్నారు. కార్మిక చట్టాలను బలహీనం చేసే నాలుగు రకాల లేబర్ కోడ్ లను సిద్ధం చేసి కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా పోరాటం ఉధృతం చేసి బిజెపి ప్రభుత్వం మెడలు వంచుతమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శేఖర్ రెడ్డి, రావుల జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఆవుల యాదయ్య, కాళ్ళ జంగయ్య, నాయకులు జగన్ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక, అంగన్వాడీ , మధ్యాహ్న భోజన పథకం, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు సరిత, అలివేలు, రంగమ్మ, కవిత, రజిత, మంజుల, పారిజాత, సంతోష,అమృత, పద్మ, లలిత, వరలక్ష్మి, విజయ, సుశీల, కృష్ణ, శివ, సుదర్శన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో చేరిన కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి

**యాచారం - ప్రభాత సూర్యుడు:** కాంగ్రెస్ పార్టీలో చేరిన కంచర్ల చంద్రశేఖర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికిన కురుమిద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు . ఈ కార్యక్రమంలో కురుమిద్ద మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి .కురుమిద్ద మాజీ ఉపసర్పంచ్ గోపాలి జోసఫ్ .బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ నీలం వెంకటేష్ ముదిరాజ్. మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సముద్రాల ప్రవీణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గోపాలి పవన్ కుమార్, పాల్గొన్నారు.

# కారు నేతలు కాంగ్రెస్‌లో కలిశారు!

మొదటిపేజీ తరువాయి..

ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీకాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆమెతో పాటు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హస్తం గూటికి చేరారు. చేవేళ్ల లోక్‌సభ సీటుపై హామీతోనే పట్నం సునీతా మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారనే వార్తలు వినిపిస్తున్నాయి. చేవేళ్ల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ తరపున బలమైన అభ్యర్థులు బరిలో ఉండటంతో.. కాంగ్రెస్ కూడా నియోజకవర్గంపై పట్టున్న పట్నం ఫ్యామిలీని రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పలు దఫాలు చర్చలు జరిపిన పట్నం కుటుంబసభ్యులు ఎట్టకేలకు ఎంపీ సీటు కోసం లైన్ క్లియర్ కావడంతో సునీతా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు కాంగ్రెస్ ఏ విధమైన హామీ ఇచ్చిందనే అంశం కూడా ఆసక్తికరంగా మారింది. బొంతు రామ్మోహన్ సికింద్రాబాద్ లేదా మల్కాజ్‌గిరి లోక్ సభ సీటు ఆశిస్తున్నట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎంపీ సీటుపై ఏ విధమైన హామీ ఇచ్చిందన్నదీ ఆసక్తికరంగా మారింది. అయితే టీకాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు రామ్మోహన్. కాంగ్రెస్‌లో చేరిన మరో నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి సైతం మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా పోటీ చేయాలని భావిస్తున్నారు. టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ స్వయాన మామ అయిన చంద్రశేఖర్ రెడ్డి, గతంలో బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే ఆయనకు బీఆర్ఎస్ తరపున పోటీ చేసే అవకాశం రాలేదు. తాజాగా ఆయన కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆయనకు సీటు విషయంలో హస్తం పార్టీ ఏ రకమైన హామీ ఇచ్చిందనే అంశంపై చర్చ జరుగుతోంది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వికారాబాద్ జడ్ పి చైర్మన్ పట్నం సునీతా మహేందర్ రెడ్డి కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బొంతు రామ్మోహన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్ని బిఆర్ఎస్ నుంచి హైదరాబాద్ మేయర్ గా సేవలందించారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఉప్పల్ నియోజకవర్గం సీటు ఇవ్వాలని బిఆర్ఎస్ అధిష్టానాన్ని అడిగినా ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో బిఆర్ఎస్ కు గుడ్ బై చెప్పి బొంతు కాంగ్రెస్ లో చేరారు. జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య కూడా కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నారు. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో రెండు సీట్లకే పరిమితమయింది. అందుకే పార్లమెంట్ ఎన్నికల నాటికి పుంజుకోవాలన్న లక్ష్యంతో ఇతర పార్టీల నేతలను ఆకర్షిస్తున్నారు. చాలా మంది నేతలు కాంగ్రెస్ లోకి చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పార్టీలో చేరిన వారిలో పట్నం మహేందర్ రెడ్డి చేవెళ్లే నుంచి పార్లమెంట్ కు పోటీ చేసే అవకాశాలు ఉన్నాయిపార్టీలో చేరిన తర్వాత నేతలు మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్ ను కలిశారు.

# కూటమి కుప్ప?

మొదటిపేజీ తరువాయి..

అలయన్స్ నుంచి బయటకు వచ్చింది. లోక్ సభ ఎన్నికల్లో తిరిగి ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ఫారుక్ అబ్దుల్లా ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇతర రాజకీయ పార్టీలతో పొత్తు లేకుండా నేషనల్ కాన్ఫరెన్స్ స్వతహాగా పోటీ చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు ఏర్పడిన ఇండియా కూటమికి అనతికాలంలోనే బీటలు వారాయి. కూటమి నుంచి ఒక్కో కీలక పార్టీ బయటకు పోతోంది. ఇప్పటికే జేడీయూచీఫ్ ఎన్డీఏతో జతకట్టగా...మరో కీలక భాగస్వామి బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేశారు. అటు అరవింద్ కేజ్రీవాల్ సైతం కూటమిపట్ల సుముఖంగా లేరు. ఇక అఖిలేష్ యాదవ్ సంగతి సరేసరి. ఇలా ఒక్కొక్కరూ కూటమి నుంచి బయటకు వెళ్లిపోతుండటంతో కాంగ్రెస్దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అయితే ఖచ్చితంగా తమతోనే ఉంటారని భావించిన మరో కీలక పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ సైతం చేయి ఛ్చింది. సీట్ల సంర్దుబాటు, ప్రధాని అభ్యర్థిపై ఎటూ తేల్చకపోవడం వల్లే ఒక్కొక్కరూ పార్టీ వీడుతున్నట్లు సమాచారం. అయితే ఫారూక్ సైతం ఎన్డీఏలో చేరడం ఖాయమనే సంకేతాలు వినిపిస్తున్నాయి. తర్వలోనే ఆయన ఎన్డీఏలో చేరే అవకాశాలను కొట్టిపారేయలేం. రానున్న లోక్ సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయంతోపాటు 400 సీట్లపై కన్నేసిన కమలం పార్టీ..అందుకు అనుగుణంగానే పావులు కదుపుతోంది. పాతమిత్రులకు మరోసారి స్నేహహస్తం అందిస్తోంది. అందులో భాగంగానే ఇటీవల చంద్రబాబును చర్చలకు ఆహ్వానించింది. నేడో రేపో తెలుగుదేశం సైతం ఎన్డీఏలో చేరడం ఖాయంగానే కనిపిస్తోంది. ఇప్పుడు మరో పాత మిత్రుడు ఫారుక్ అబ్దుల్లాకు వలవేసింది. కశ్మీర్ స్వయంప్రతిపత్తి ఎత్తివేయడంతోపాటు..లద్దాక్ ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడంపై కశ్మీర్ పార్టీలు బీజేపీపట్ల గుర్రుగా ఉన్నాయి. అయినప్పటికీ బీజేపీ సామ, దాన, భేద దండోపాయాలన్నీ ప్రయోగించి ఒక్కొక్కరినీ దారిలోకి తెచ్చుకుంటున్నాయి. జమ్మూ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఇటీవలే కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ఫారుక్ అబ్దుల్లాకు సమన్లు జారీ చేసింది. దీని ఫలితమే ఆయన ఎన్డీఏలోకి రానున్నట్లు తెలుస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఆర్థిక మంత్రి హరీశ్‌రావు!

- ఇంటర్ ప్రశ్నపత్రంలో ముద్రణ
- ప్రభుత్వం మారినా తప్పులు తప్పడం లేదని విమర్శలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో ప్రభుత్వం మారింది కానీ, పరీక్షల్లో తప్పులు మాత్రం కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో తప్పులు దొర్లాయి. అది కూడా చిన్న విషయంలో కాదు, ఏకంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి విషయంలో ప్రశ్నాపత్నం తయారు చేసినవారు తప్పులో కాలేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా.. ఇంటర్ ప్రాక్టికల్ ఎగ్జామ్ పేపర్లో మాత్రం ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు అని రావడంతో అంతా షాకయ్యారు. సర్కార్ మారినా, ప్రశ్నాపత్రాల్లో తప్పులు మాత్రం మారలేదని సెటైర్లు వేస్తున్నారు. నవంబర్ నెలాఖరు-లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోగా, కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రాష్ట్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అధికారం మారి 2 నెలలు గడిచిపోయింది. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా.. ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క బాధ్యతలు చేపట్టారు. కానీ తాజాగా జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ లో మాత్రం రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు అని ఓ ప్రశ్నలో ఇచ్చారు. ప్రస్తుత ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క కాగా, హరీష్ రావును మంత్రిగా ప్రశ్నాపత్రం ముద్రించడం హాట్ టాపిక్ గా మారింది.

# సంపాదకీయమ్..

## మూడో స్థానానికి భారత్ ఆర్థిక వ్యవస్థ

జపాన్‌ను వెనక్కి నెట్టిన జర్మనీ.. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. గత 14 ఏళ్లుగా మూడో స్థానంలో ఉన్న జపాన్..నాలుగో స్థానానికి పడిపోయింది. ఆర్థిక మాంద్యం ప్రభావానికి లోనవుతున్న జపాన్‌ను వెనక్కి నెట్టి జర్మనీ మూడో స్థానంలో నిలిచింది. తాజా గణాంకాల మేరకు గత సంవత్సరం జపాన్ ఆర్థిక వ్యవస్థ 1.9 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేసుకుంది. గత ఏడాది జపాన్ 4.2 ట్రిలియన్ డాలర్ల వాస్తవిక జీడీపీ నమోదు చేసుకోగా.. జర్మనీ 4.4 ట్రినియన్ డాలర్లు నమోదు చేసుకుంది. దేశంలో వృద్ధుల సంఖ్య పెరగడం, పిల్లల సంఖ్య తగ్గడం జపాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ఫలితంగా జపాన్ పోటీతత్వాన్ని, ఉత్పాదకతను కోల్పోతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే యెన్ విలువ పతనం కావడంతో జపాన్ ఆర్థిక పరిస్థితి బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే జపాన్ కరెన్సీ 2022లో దాదాపు 20 శాతం క్షీణించగా, 2023లో ఏడు శాతం పడిపోయింది.ఒకప్పుడు అగ్ర రాజ్యం అమెరికా ఆర్థిక వ్యవస్థను ఛాలెంజ్ చేసిన జపాన్.. ఇప్పుడు క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. 1990ల నుంచి జపాన్ ఆర్థిక వ్యవస్థ జోరు తగ్గింది. 2010 నాటి వరకు జపాన్ ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చలామణి అయ్యేది. అయితే ఆ దేశాన్ని చైనా వెనక్కి నెట్టి.. రెండో స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు చైనా ఆర్థిక వ్యవస్థ పరిణామం జపాన్ కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ఇప్పుడు జపాన్ మరో స్థానాన్ని కోల్పోయి.. జర్మనీ కంటే దిగువున నాలుగో స్థానానికి పరిమితం అయ్యింది. యూరఫ్ దేశాల్లో జర్మనీ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది. అయితే జర్మనీ ఆర్థిక పరిస్థితి కూడా ప్రస్తుతం కొన్ని ఆటుపోట్లను ఎదుర్కొంటోంది.జపాన్, జర్మనీ ఆర్థిక వ్యవస్థలు నేలచూపులు చూస్తుండగా.. భారత్ ఆర్థిక వ్యవస్థ పైపైకి దూసుకుపోతోంది. కొన్నేళ్లలో జర్మనీ, జపాన్‌లను భారత్ వెనక్కే నెట్టి.. మూడో స్థానానికి ఎగబాకే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ, జపాన్‌ల తర్వాత ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. జర్మనీలో ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇంధన ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఆర్థిక వృద్ధి నిలిచిపోయింది. జపాన్, జర్మనీ జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. సహజ వనరులు తగ్గుతున్నాయి. ఆ రెండు దేశాలు కార్ల ఎగుమతిలో కఠినమైన పోటీని ఎదుర్కొంటున్నారు. ఎఓఈ డేటా ప్రకారం, భారతదేశం 2026లో జపాన్‌ను, 2027లో జర్మనీని అధిగమించగలదని అంచనా. కానీ జపాన్ , జర్మనీల్లో నెలకొన్న ప్రతికూల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భారత్ త్వరలోనే ఈ దేశాలను అధిగమించే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఫోర్బ్స్ ప్రకారం, అమెరికా ప్రస్తుతం 27.974 ట్రిలియన్ల డాలర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 18.566 ట్రిల్లియన్ డాలర్లతో చైనా రెండో స్థానంలో నిలుస్తోంది. 4.730 ట్రిల్లియన్ డాలర్లతో జర్మనీ మూడో స్థానంలో, 4.291 ట్రిల్లియన్ డాలర్లతో జపాన్ నాలుగో స్థానంలో ఉన్నాయి. భారతదేశం 4.112 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది.బ్రిటన్ జనాభా దాదాపు 7 కోట్లు కాగా, అంచనాల ప్రకారం ప్రస్తుతం భారతదేశ జనాభా దాదాపు 140 కోట్లు. బ్రిటన్ కంటే భారతదేశం పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం పెద్ద విషయం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే సంపద పరంగా భారతదేశం బ్రిటన్ కంటే ఇరవై రెట్లు వెనుకబడి ఉంది."ఆర్థిక వ్యవస్థ మొత్తం పరిమాణంలో భారతదేశం బ్రిటన్‌ను అధిగమిస్తుంది. కానీ, ముఖ్యమైన విషయం ప్రజల ఆర్థిక పరిస్థితి. బ్రిటన్ తలసరి ఆదాయం ఇప్పటికీ 45,000 డాలర్లకు పైగానే ఉంది. అదే ఇండియాలో తలసరి ఆదాయం ఏడాదికి కేవలం 2,000 డాలర్లు మాత్రమే" అని సీనియర్ జర్నలిస్ట్, ఆర్థిక విశ్లేషకుడు ఎం.కె. వేణు అన్నారు.రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలను పోల్చాలంటే తలసరి ఆదాయాలను పోల్చి చూడటం సరైన విధానమని వేణు అన్నారు."ఈ విషయంలో భారతదేశం ఇప్పటికీ యూకే కన్నా చాలా వెనుకబడి ఉంది. తలసరి ఆదాయంలో భారతదేశం చాలా వెనుకబడిన దేశాల జాబితాలో ఉంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక పరంగా భారత్ బ్రిటన్‌ను అధిగమించిందని చెప్పడం సరికాదు" అన్నారు వేణు.ఇదే విషయాన్ని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఆర్థిక వ్యవహారాల నిపుణుడు అరుణ్ కుమార్ కూడా చెప్పారు."భారత జనాభా బ్రిటన్ జనాభా కంటే ఇరవై రెట్లు ఎక్కువ. మన జీడీపీ వారి జీడీపీతో సమానంగా ఉన్నామంటే, తలసరి ఆదాయంలో మనం 20 రెట్లు వెనకబడి ఉన్నామని అర్థం. యూకే ఆర్థిక వ్యవస్థను, భారత ఆర్థిక వ్యవస్థను పోల్చడం సరికాదు. తలసరి ఆదాయంలో మనం యూకే కన్నా చాలా వెనకబడి ఉన్నాం" అన్నారు ప్రొఫెసర్ అరుణ్ కుమార్.ఇంతకు ముందు మనకు అభివృద్ధి చెందుతున్న లేదా వెనుకబడిన దేశంగానే పేరుంది. కానీ, ఇప్పుడు భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. గత పదేళ్లలో లేదా 1990లలో భారతదేశం తీసుకున్న చర్యలు వాటి ప్రభావాన్ని చూపించాయి. భారతదేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరిగాయి. 9వ దశకంలో భారతదేశం దగ్గర పరిమిత నిల్వలు మాత్రమే ఉన్నాయి. కానీ, నేడు భారతదేశం అతిపెద్ద విదేశీ మారక నిల్వలున్న నాలుగు దేశాలలో ఒకటి" అని కేడియా అన్నారు."బ్రిటన్, పశ్చిమ ఐరోపా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుంచించుకుపోతున్నప్పటికీ, భారతదేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా పురోగమిస్తోంది. ఎన్ని సవాళ్లు ఎదురైనా, భారతదేశం తన వృద్ధి రేటును కొనసాగించింది" అని కేడియా అన్నారు."ప్రస్తుతం పాశ్చాత్య దేశాల ఆర్థిక వ్యవస్థలలో క్షీణత ఉంది. దాని నుండి భారతదేశం కూడా లాభపడింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా పురోగమిస్తోంది. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థ రాబోయే నాలుగు-ఐదేళ్ల పాటు వృద్ధి చెందుతూనే ఉన్నప్పటికీ, ప్రజల వ్యక్తిగత ఆదాయం పాశ్చాత్య దేశాల స్థాయికి చేరుకోవడానికి చాలా సమయం పడుతుంది" అని వేణు అభిప్రాయపడ్డారు.

## ఈటల సీటెక్కడా..?

మొదటిపేజీ తరువాయి..

ఇతర స్థానాల్లో పోటీ చేయాలని ఆయకు పార్టీ నేతలు సంకేతాలు పంపుతున్నట్లు సమాచారం.ఈటల రాజేందర్ మాత్రం ఇవేవి పట్టించుకోకుండా మల్కాజ్‌గిరిలో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కార్యక్రమాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అధిష్టానానికి సంకేతాన్ని పంపుతున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు ఆయన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'ఈటల ఫర్ మల్కాజ్‌గిరి' క్రికెట్ ట్రోఫీని ఆయన అనుచరులు స్టార్ట్ చేశారు. అయితే దీనికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ కూడా స్వయంగా తన నివాసంలో ఈటల రాజేందర్ రిలీజ్ చేశారు. ఈటలకే మల్కాజ్‌గిరి టికెట్ రాబోతున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. దీంతో మరోసారి ఈటల దుమారం తెరపైకి వచ్చింది. ఎంపీగా పోటీపై బీజేపీ అధిష్టానం నిర్ణయం కంటే ముందే అనుచరుల పేరుతో తానే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.ఈ అంశంపై పార్టీ నేతలు హైకమండ్ కు పిర్యాదులు చేశారు. ఇప్పటికి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గతంలో ఆయనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినా పార్టీ పరిస్థితి మెరుగుపడలేదు. ఈటల సూచనల మేరకే బీసీ సీఎం నినాదాన్ని అందుకున్నారని కూడా అంటున్నారు. ఇప్పుడు ఈటలకు సీటు కేటాయించకపోతే..బీజేపీలో రాజీనామాలు ఎక్కువగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పార్లమెంటు ఎన్నికల్లో గెలిచేందుకు నానా తంటాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణకు తాను శాశ్వత ముఖ్యమంత్రినని భావించారు. అదే ఆయన పార్టీని కొంపముంచింది. ఉద్యమాలంటేనే ఆయనకు పడేది కాదు. ఉద్యమకారులను దూరంగా పెట్టారు. ఆందోళనలు చేస్తే అణగదొక్కేంత వరకూ ప్రగతి భవన్ లో నిద్రపోరన్న నిజాన్ని అందరూ ఒప్పుకునేదే. అలాంటి కేసీఆర్ ఇప్పుడు ప్రజా ఉద్యమాలు కావాలని అడగడం విడ్డూరంగా ఉందంటున్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డు మీదకు వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పడంతో రాజకీయ నేతలు నవ్వు ఆపుకోలేకపోతున్నారు. ఓటమి తర్వాత ఆయన ప్రజల్లోకి వచ్చి ఉద్యమాలు చేయాలని, నడిరోడ్డు మీద నిలదీస్తానని చెప్పడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించేలా అనిపించింది. ఉస్మానియా విద్యార్థులను యూనివర్సిటీ గడప దాటినీయంది ఎవరి హయాంలో? ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పడితే ఉక్కుపాదంతో అణిచి వేసింది ఎవరి పాలనలో? తర్వాత ఎన్నికలు వచ్చే సరికి వారిపై అనురాగం, ఆప్యాయతలు కురిపించింది కూడా అదే నేత. అయినా ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని కేసీఆర్ ఇప్పటికి గ్రహించారా? ఆయన ముఖ్యమంత్రి గా ఉన్న కాలంలో ధర్నా చేయడానికి కూడా అనుమతులు ఇవ్వకపోవడాన్ని ఇప్పటికిప్పుడు మర్చిపోతారా? ధర్నా చౌక్ ను ఎత్తివేసిన ఘనత ఏ ప్రభుత్వానిది అన్న ప్రశ్నలు సహజంగానే ప్రజల నుంచి వస్తుండటం విశేషం. ఈ డైలాగ్ పై సోషల్ మీడియాలో కేసీఆర్ పై సెటైర్లు వేస్తున్నారు నెటిజన్లు.కేసీఆర్ తాను అనుకున్నది వర్క్ అవుట్ కాలేదు. తనను తప్ప తెలంగాణ ప్రజలు మరెవరిని నమ్మరని భావించారు. భ్రమించారు. అందులోనూ



గ్రూపులతో నిత్యం కొట్లాడే కాంగ్రెస్ అస్సలు అధికారానికి దరిదాపుల్లోకి కూడా రాదని అంచనా వేశారు. కానీ రేవంత్ రెడ్డి రూపంలో ఆయనకు ముప్పు పొంచి ఉందని గ్రహించలేకపోయారు. మాటకు మాట.. డైలాగ్ కు డైలాగ్ తోనే కొట్టడంలో కేసీఆర్ ని మించిపోయారు రేవంత్ రెడ్డి. కౌంటర్ కు ప్రతి కౌంటర్ చేస్తున్నారు. నల్లగొండ సభలో పాలిచ్చే గేదెను పంపి.. దున్నపోతును తెచ్చుకున్నారంటూ కేసీఆర్ చేసిన కామెంట్స్ పై రేవంత్ సెటైర్ వేశారు. కంచరగాడిదను ఇంటికి పంపి రేసు గుర్రాన్ని తెచ్చుకున్నారంటూ కౌంటర్ వేశారు. ఇలా కేసీఆర్ కు ఏమాత్రం తగ్గకుండా డైలాగుల్లో, చేతల్లో రేవంత్ రెడ్డి ఎదురుదాడికి దిగుతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో... దీంతో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్ కు ఎక్కువ స్థానాలు సాధించడమెలా? అన్న బెంగ పట్టుకుంది. కాంగ్రెస్ కన్నా కనీసం రెండు, మూడు స్థానాలను సాధించగలిగితేనే పార్టీలో నేతలు నిలుస్తారు. లేకుంటే వరసబెట్టి తమ దారి తాము చూసుకుంటారు. నిత్యం తమకు అందుబాటులో ఉండే నేత వద్దకు రాజకీయ నాయకులు సహజంగానే పరుగులు తీస్తారు. దీంతో పార్లమెంటు ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికలో ఏమాత్రం అలక్ష్యం చూపకూడదని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ప్రచారంలోనూ తాము కాంగ్రెస్ తో నెగ్గుకు రాలేమని, అందుకే సిట్టింగ్ ఎంపీలను మార్చి కొత్తవారికి అవకాశమిచ్చి ప్రయోగం చేయాలన్న భావనలో గులాబీ బాస్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద తమ బాస్ కు ఎంత కష్టమొచ్చిందన్న కామెంట్స్ ఆ పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి.

# ఢిల్లీకి కాంగ్రెస్ సూట్‌కేసులు!

మొదటిపేజీ తరువాయి..

ఉన్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నదని అన్నారు. మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వైసీపీ నాయకులు వెళ్లల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది కానీ అమలు చేయడం లేదు. ఢిల్లీకి సూట్ కేసులను మోసే పనిలో ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటక నుంచి ఇక్కడికి సూటు కేసులు వచ్చాయి. రాహుల్ గాంధీ కోసం తెలంగాణలో బిల్డర్ల దగ్గర, కంపెనీలు, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ బెదిరిస్తున్నది. ఆ పార్టీ నేతల మాటలు కోటలు దాటుతాయి కానీ.. ఆరు గ్యారంటీల అమలు లేదు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ లా కాదు.. చేసేదే చెప్తుంది.. చెప్పేది చేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన పీవీ నర్సింహారావును మోదీ ప్రభుత్వం గౌరవించింది. పీవీ చనిపోతే.. ఆయన పార్థీవ దేహాన్ని ఏఐసీసీ ఆఫీసులోకి అప్పటి కాంగ్రెస్ పార్టీ రానియ్యలేదు. ఆయనకు స్మృతి వనం నిర్మించలేదు. ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించనీయలేదు. ఆయన పార్థీవ దేహాన్ని హైదరాబాద్ కు పంపిన చరిత్ర కాంగ్రెస్ ది. ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అయినా.. మోదీ ప్రభుత్వం పీవీ సేవలను గుర్తించి ఆయనకు భారత రత్న ఇచ్చింది"అని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే..**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే అని కిషన్ రెడ్డి విమర్శించారు. "ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే. ఈ రెండు పార్టీలు మజ్లిస్ పంచన చేరుతాయి. బుజ్జగింపు రాజకీయాలు చేస్తాయి. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద దర్యాప్తు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యం లేదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ కూడా అవినీతి పార్టీ కాబట్టి. సీబీఐతో విచారణ జరిపించాలని మేము డిమాండ్ చేస్తే.. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేస్తున్నది. విజిలెన్స్ తో అయ్యేది లేదు.. పోయేది లేదు. కాంగ్రెస్ చెయ్యి బస్మాసుర హస్తం.. చెయ్యి గుర్తుకు ఓటేస్తే.. అదే చెయ్యిని ప్రజల తలపై పెట్టి మోసం చేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వక వారు జీహెచ్ఎంసీ ముందు ధర్నా చేసే దుర్మార్గ స్థితికి తీసుకువస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని మరింత దిగజార్చనుంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వడం లేదు"అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

**మోదీతోనే తెలంగాణ అభివృద్ధి**

గత తొమ్మిదన్నరేండ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "రూ.400 కోట్లతో చర్లపల్లి, రూ.720 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్, రూ. 450 కోట్లతో కాచిగూడ, రూ. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్లను మోదీ ప్రభుత్వం. ఎయిర్ పోర్టు తరహాలో సికింద్రాబాద్ స్టేషన్ డెవలప్ కానుంది. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే, పెట్టుబడులు, ఉద్యోగాలు రావాలంటే మోదీ నాయకత్వం.. బీజేపీ నాయకత్వం అవసరం. భద్రాద్రి అభివృద్ధికి రూ.50 కోట్లు ఇచ్చారు. వరంగల్ రామప్ప దేవాలయానికి మోదీ కృషితో యునెస్కో గుర్తింపు వచ్చింది. జోగిలాంబ దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణలో లక్షా 20 వేల కోట్ల రూపాయల విలువైన రహదారుల నిర్మాణం జరిగింది. హైదరాబాద్ చుట్టూ రూ.26 వేల కోట్ల ట్రిపుల్ ఆర్ రోడ్డును మోదీ మంజూరు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో ఇది గేమ్ చేంజర్ కానుంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీది"అని పేర్కొన్నారు.

**ఉగ్రవాదంపై ఉక్కుపాదం**

దేశంలో ఉగ్రవాదంపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "నిత్యం ఉగ్రవాదుల బాంబులతో రావణకాష్ఠంలా మండే కశ్మీర్ లో 370 ఆర్టికల్ ఎత్తేసి.. అక్కడ శాంతి నెలకొల్పిన ఘనత నరేంద్ర మోదీ ప్రభుత్వానిది. దేశంలో శాంతి



భద్రతలు మెరుగయ్యాయి. హైదరాబాద్ లో ఒకప్పుడు బాంబు పేలుళ్లు, ఉగ్రవాదుల చేతిలో పలువురి హత్యలు జరిగేవి. మోదీ వచ్చిన తర్వాత ఐఎస్ఐ ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. పాక్ లో ఇండియన్ కరెన్సీ ముద్రించి భారత్ లో చెలామణి చేసేవారు. ఇప్పుడు అది ఆగింది. ప్రపంచం దృష్టిలో పాక్ ను దోషిగా నిలబెట్టిన ఘనత మోదీ ప్రభుత్వానిది. రొట్టె ముక్క కోసం ఇప్పుడు పాకిస్తా న్ లో ప్రజలు కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఉగ్రవాదులు దేశంలో దాడులు చేస్తే.. ప్రభుత్వాలు మౌనంగా ఉండేవి. కానీ మోదీ అలా కాదు.. దేశంలో దాడులు జరిపిన టెర్రరిస్టులను గుర్తించి సర్జికల్ స్ట్రైక్ లు, ఎయిర్ స్ట్రైక్ లు చేసి వారిని మట్టుబెట్టారు. కాంగ్రెస్ హయాంలో ఎంపీలు, మంత్రులు అవినీతి ఆరోపణలతో, కుంభకోణాలతో జైలుకు వెళ్లారు. తొమ్మిన్నర ఏండ్ల మోదీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు. వచ్చే 25 ఏండ్లలో ప్రపంచ దేశాలకు విశ్వగురువుగా భారత్ ను నిలబెట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. అందులో భాగస్వామ్యం అయ్యేందుకు మనం సిద్ధమవ్వాలి"అని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఉమెన్స్ టీమ్ హెడ్ కోచ్‌పై వేటు

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : హైదరాబాద్ క్రికెట్ టీమ్ బస్సులో హెడ్ కోచ్ జైసింహా మద్యం సేవిస్తూ కనిపించిన వీడియోలు వాట్సాప్ గ్రూప్లు, టీవీ చానెళ్లల్లో ప్రత్యక్షమవడంతో అతడిపై తక్షణం వేటు వేస్తున్నట్టు హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఉత్తర్వులు ఇచ్చారు.దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, సదరు కోచ్పై తదుపరి చర్యలు తీసుకుంటామని జగన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ఉపేక్షించబోమని జగన్మోహన్ రావు సస్పెన్షన్ ఉత్తర్వుల్లో తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215